


కాంగ్రెస్‌లో సమన్వయం కరువు!

- జిల్లాలో పార్టీ నేతలు, శ్రేణుల మధ్య కొరవడిన సమన్వయం
- నియోజకవర్గాల్లో ముదురుతున్న గ్రూపు విభేదాలు
- బోథ్‌లో వరుస వలసలతో ఖాళీ అవుతున్న స్థానిక క్యాడర్
- అధికార పార్టీకి సవాల్‌గా మారిన ఎమ్మెల్సీ ఎన్నికలు
- కలిసికట్టుగా పని చేస్తేనే కాంగ్రెస్‌కు విజయ అవకాశాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేతల గ్రూపు విభేదాలు, అసమ్మతితో అధికార పార్టీ ఆగమాగమవుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంకా పార్టీలో పరిస్థితులు చక్కబడినట్లు కనిపించడం లేదు. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాక పోవడంతో అధిష్ఠానం పెద్దలు కూడా అంతగా పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఇటీవలే జిల్లాలో మాజీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కలు పర్యటించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పార్లమెంట్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అయినా పార్టీ పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. అసలే జిల్లాలో పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం మినహా ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. అధికారంలో ఉండి కూడా పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఓడిపోవాల్సి వచ్చింది. అయినా హస్తం పార్టీ నేతలకు గుణపాఠం కలిగినట్లు కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో కార్యకర్తలు విసుగెత్తిపోతున్నారు. పార్టీలో ఎవరికి జై అంటే ఏం జరుగుతుందోనని భయంతో పని చేస్తున్నారు. అధికారంలో ఉన్నా.. ప్రయోజనం లేదన్న భావనతో పలువురు నేతలు కనిపిస్తున్నారు. పరిస్థితులు ఇలానే ఉంటే రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయ అవకాశాలపై ప్రభావం పడుతోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

తారాస్థాయికి విభేదాలు

నియోజకవర్గాల్లో నేతల మధ్య గ్రూపు విభేదాలు అందనంత స్థాయికి చేరుకుంటున్నాయి. ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలను చేపడుతూ అధిష్ఠానం పెద్దల ఆశీస్సులను పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిలాబాద్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతల మధ్య నువ్వా? నేనా? అన్నట్లుగా పరిస్థితి నెలకొంది. ఈ నియోజక వర్గంలో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి నేతలు పని చేస్తున్నారు. బోథ్‌లో మాజీ ఎంపీ సోయం బాపురావు పార్టీలో చేరడంతో క్యాడర్ రెండు వర్గాలుగా విడిపోయి పని చేస్తోంది. ఖానాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మరో మహిళా నేత మధ్య విభేదాలు ముదురుతున్నాయి. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో మండిపడడం చర్చనీయాంశంగా మారింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ వర్గాల మధ్య నువ్వా?నేనా? అన్నట్లుగా పరిస్థితులు నెలకొంటున్నాయి. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఒకే విధమైన పరిస్థితి కనిపిస్తోంది. ఒకరిపై ఒకరు అధిష్ఠానం పెద్దలకు ఫిర్యాదులు చేసుకుంటూ తగ్గేదే లేదంటూ పార్టీలో చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు.



చేజారిపోతున్న క్యాడర్

అన్ని నియోజకవర్గాల్లోనూ అడపాదడప పార్టీలో చేరికలు జరుగుతున్నా.. బోథ్ నియోజకవర్గంలో మాత్రం వరుస వలసలతో కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ఖాళీ అవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అధికార పార్టీలోకే ఎక్కువగా చేరికలు ఉంటాయి. కానీ బోథ్ నియోజక వర్గంలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కారు దూకుడుకు కాంగ్రెస్ చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది పార్టీ క్యాడర్ చేజారి పోతోంది. కొందరు ఆశావహ నేతలు కాంగ్రెస్‌లో గెలవలేమన్న భావనతోనే బీఆర్ఎస్‌లో చేరుతునట్లు ప్రచారం జరుగుతోంది. మరికొంత మంది మండల, గ్రామ స్థాయి నేతలు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. వలసలకు అడ్డుకట్ట వేయకుంటే బోథ్‌లో కాంగ్రెస్‌కు కష్ట కాలమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సరైన నాయకత్వం లేకపోవడంతోనే పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఆసంపూర్తి పథకాల అమలులో సొంత పార్టీలోనే బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంతంత మాత్రంగానే ఆదరణ

కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లోను రెబల్స్ బెడద తప్పడం లేదు. ఆ పార్టీ నేత మంచికట్ల ఆశమ్మ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసి బరిలో దిగడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాపాలన పేరిట ప్రజల్లోకి వెళ్తున్న కాంగ్రెస్‌కు అంతంతమాత్రంగానే ఆదరణ కనిపిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే ఆ పార్టీకి గండంగా మారుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా దశల వారీగా అమలు చేయడం కొంత ఇబ్బందికరంగా

(తరువాయి 6వ పేజీలో...)

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు

- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారుల గైర్హాజరుపై మండిపాటు



అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా



పాఠశాల భవనం నిర్మించాలని కలెక్టరేట్‌కు వచ్చిన తల్లిదండ్రులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో చాలా మంది అధికారులు తను వచ్చిన తర్వాత కూడా రావడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు. అర్జీలను స్వీకరించిన కలెక్టర్ సంబంధిత డీఆర్‌డీవో, మున్సిపల్ కమిషనర్ అక్కడ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఏవో రాం రెడ్డికి వారికి ఫోన్ చేసి పిలిపించాలన్నారు. కలెక్టర్ వచ్చిన కూడా అధికారులు రాకపోవడం సరైన విధానం కాదన్నారు. తర్వాత గ్రీవెన్స్‌కు వచ్చిన అధికారులు వారికి సంబంధించిన అర్జీలపై కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అర్జీలదారుల సమస్యలను విన్న కలెక్టర్.. వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. కాగా సోమవారం నాటి ఫిర్యాదు విభాగంలో మొత్తం 69 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులుతి, తదితరులు పాల్గొన్నారు.

● 'మా స్థలాన్ని ఆక్రమించారు'

తన స్థలాన్ని ఆక్రమించారంటూ భోరజ్ మండలంలోని అకోలి గ్రామానికి చెందిన సుభాష్ అధికారులకు విన్నవించారు. గ్రామంలో తన స్థలాన్ని ఓ కాంగ్రెస్ నాయకుడు ఆక్రమించాడని, వేరే ఇంటి నెంబర్‌తో లాయర్ నోట్ పంపిస్తున్నారని అన్నారు. రెవెన్యూ రికార్డులో తమ పేరు ఉందని, తహసీల్దార్‌కు కూడా విన్నవించామని వివరించి కలెక్టర్‌ను వినతిపత్రం అందజేశామన్నారు.

● 'నీటి సమస్య తీర్చండి సారు..!'

చాలా సంవత్సరాల నుంచి నీటి సమస్యను ఎదుర్కొంటు, పోరాడుతున్నామని తమ సమస్యను ఇప్పుడైనా పరిష్కరించాలని నార్నూర్ మండలంలోని సుంగాపూర్ గొండ్ గూడ గ్రామస్థులు పెందుర్ లక్ష్మణ్, మెస్రం షేకు కోరారు. కిలోమీటర్ల మేర నడిచి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి తమ గ్రామానికి ఉందన్నారు. ప్రతీ కాలంలో తమకు ఈ సమస్య ఉందని, ఇప్పుడు ఎండాకాలం ఈ సమస్య అధికమవుతోందని వాపోయారు. కరెంట్ పైప్ లైన్ బావి మంజూరు చేయాలని తమ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

● 'అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలి'

జిల్లా అధికారులు పని చేయని ఉద్యోగులను కాపాడుతున్నారని, ప్రజలకు సేవలందించడంపై దృష్టి పెట్టాలని సూచించి అక్రమ డిప్యూటేషన్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో రిమ్స్ మలేరియా ల్యాబ్‌లో రెండు టెక్నీషన్ పోస్టులు ఉంటే ముగ్గురికి డిప్యూటేషన్ ఇచ్చారని ఆరోపించారు. ఇలా అక్రమ డిప్యూటేషన్‌లు ఇస్తూ మండలస్థాయి ప్రజలకు వైద్య సేవలు అందకుండా ఉద్యోగులకు వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. అన్ని మండలాల ప్రజలకు సేవాలందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

● 'పాఠశాల భవన నిర్మాణం చేపట్టండి'

మావల మండలంలోని దుబ్బగూడ గ్రామం దాజీనగర్‌లో నిధులు మంజూరు చేసి నూతన పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేయాలని తల్లిదండ్రులు కోరారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల రేకుల షెడ్డుతో ఉందని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు అవుతున్నాయని ఇప్పుడు ఎండా కాలంలోని వేడి ఉంటుందన్నారు. ఇది వరకుది డీఈవోకు సెక్టోరియల్ అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. మున్సిపల్ ఇంజనీర్ ద్వారా ప్లాన్ వేసి కలెక్టర్‌కు పంపమని వారు చెబతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి భవన నిర్మాణానికి కృషి చేసి పిల్లల చదువుకు ఆటంకం తొలగించాలని కోరారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

24న సంత్ సేవాలాల్ జయంతి

నేరడిగొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 24న జరిగే సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల పోస్టర్లను సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్త ప్రజలు ఆదిలాబాద్‌లో జరిగే జయంతి ఉత్సవాలకు తరలి రావాలని పేర్కొన్నారు. ఇందులో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి'

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని గుడిహత్నూర్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జాతర్ల గ్రామంలో ఆర్బీఐ సహకారంతో ఆర్థిక అక్షరాస్యత సంస్థ ద్వారా సీనియర్ సిటిజన్‌లకు ఎన్‌సిఎఫ్ఈ (నేషనల్ సెంటర్‌ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో అందించే సేవలు, అకౌంట్‌లో వివరాలు, ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు పొదుపు చేస్తే కలిగే లాభాలను వివరించారు. ఆర్థిక అక్షరాస్యత ద్వారా అన్ని వర్గాల వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటసీ పెందుర్ ఈశ్వర్, గ్రామ పటేల్, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి : పీడీఎస్‌యూ

భీంపూర్, ఫిబ్రవరి 17,(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రం భీంపూర్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమక్రసీ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. ఆరు గ్యారంటీ పథకాలు అమలుకు నోచుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, మేస్రం మారుతి దత్తు, సోమేష్ రాజు, తదితరలు పాల్గొన్నారు.



గోడ ప్రతులను విడుదల చేస్తున్న నాయకులు



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు

'కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో భూ అక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కోరారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో పీవోను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇచ్చోడలోని సర్వే నెం. 120/1లో 3.30 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసి లేఔట్‌లు వేస్తున్నారని తెలిపారు. అదే మాదిరి సర్వే నెం.120/ఆ లో 7.20 ఎకరాలు ప్రభుత్వ మైనార్టీ పాఠశాల ప్రాంతంలో హోటల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. పెసా చట్టం ఐదవ షెడ్యూల్‌లో 1/70 చట్టాన్ని కాదని అక్కడి నాయకులు కలిసి ప్రభుత్వ భూమిని ఇష్టానుసారంగా గిరిజనేతరులకు ఎలాంటి అనుమతులు లేకుండా లేఔట్లకు అవకాశం ఇస్తున్నారన్నారు. ఈ విషయమై ఇచ్చోడ తహసీల్దార్‌కు వివరించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమణదారులను తొలగించాలని త్వరగా ఈ సమస్య తన పరిధిలో రాదని తెలిపారన్నారు. అదే విధంగా పంచాయతీ సెక్రటరీ సైతం నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ఈ విషయంలో ఐటీడీఏ ప్రాజెక్టు జోక్యం చేసుకొని గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహసీల్దార్, సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని సంఘర్షణ సమితి నాయకులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో సత్వరమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి జిల్లా కోఆర్డినేటర్ వసంత్‌రావును ఆదేశించారని రామారావు వివరించారు. ఆయన వెంట అరక ఉమేష్, అరక దేవరావు, మరప శంభు, మేస్రం లింగు, వెడమశేఖర్, అర్క అశోక్, తదితరులు ఉన్నారు.

'దినసరి వేతనాల బడ్జెట్ విడుదల'

ఉట్నూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న దినసరి ఉద్యోగులు, శానిటేషన్ వర్కర్ల వేతనాల బడ్జెట్‌ను గిరిజన సంక్షేమశాఖ అధికారులు విడుదల చేశారని దినసరి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు కేబీసీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు సౌకత్ హుస్సేన్‌లు తెలిపారు. దీనిలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు రూ.2.39 కోట్లు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు రూ.1.24 కోట్లు, మంచిర్యాల జిల్లాకు రూ.65.71 లక్షలు, నిర్మల్ జిల్లాకు రూ.30 లక్షలు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. అంతేకాకుండా.. గత నెల 24న ప్రగతిభవన్‌కు వెళ్లి దినసరి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లగా.. ఈ సమస్య పరిష్కారం అయ్యిందని ఆయన పేర్కొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘ నాయకులు

ప్రభుత్వ నిర్ణయాన్ని పునః సమీక్షించాలి : మాల సంక్షేమ సంఘం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునః సమీక్షించాలని మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి విన్నవించారు. 2014 నుంచి 2024 రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు చేసిన పథకాలు విద్యా, ఉద్యోగ, స్వయం ఉపాధి, దళితబంధు, దళితబస్తీ, రాజకీయ అన్ని రంగాలలో మాలలకు, మాల ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను పునర్ సమీక్షించి 2024 జనాభా లెక్కల ప్రకారం మాలలకు న్యాయం జరిగే విధంగా ఎంపారికల్ డాటా సేకరించి రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, నాయకులు మేకల మల్ల న్న, బేర దేవన్న, సింగరి అశోక్, బబ్బిలి సుధాకర్, సూరం భగవాన్లు, దాసరి బాబన్న, పాశం, రాఘవేంద్ర, రాళ్లబండి శంకర్, తొగరి ప్రకాష్, అయిత పోచ్చన్న, మలపతి సుభాష్, కాడే స్వామి, మేదరి స్వామి, తదితరులున్నారు.

గ్రామ పటేల్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి గ్రామ పటేల్ కుమ్ర డొంగురావు పటేల్ సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారి స్వగ్రామానికి వెళ్లి డొంగురావు పటేల్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు సుదర్శన మహా యజ్ఞం



మహా యజ్ఞంలో పాల్గొన్న మహిళలు

7 లో

ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

- రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు : తలమడుగు తహసీల్దార్
- అక్రమంగా మొరం తరలిస్తున్న నాలుగు టిప్పర్ల పట్టివేత
- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



మొరం టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం

బీజేపీ, బీఆర్ఎస్ ఒకే గూటి పక్షులు : ఆడె

నేరడిగొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండల బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఏలేటి మనోజ్‌రెడ్డి (బన్నీ) సోమవారం ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని, బోథ్ నియోజక వర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి వైపు నడిపిస్తున్న ఆడే గజేందర్ నాయకత్వంలో చేరడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ యువ నాయకులకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని అన్నారు. గత పదేళ్లుగా లేని అభివృద్ధిని కేవలం ఒక్క సంవత్సరంలోనే చేసి చూపిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వానిది అని అన్నారు. ఇందులో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడె వసంత్‌రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, రాథోడ్ కమల్ సింగ్, కపిల్‌దేవ్, రమేష్, యువ నాయకులు తొడసం శంకర్, ఎండీ సద్దాం, లక్కాన్, శ్రీనవాస్, తదితరులు పాల్గొన్నారు.

గిమ్మా అంగన్‌వాడీ భవనం పరిశీలన

జైనథ్ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిమ్మా గ్రామంలో గల ప్రభుత్వ అంగన్‌వాడీ భవనాన్ని ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాలసుహాసినిరెడ్డి సోమవారం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం రూ.9లక్షలతో పూర్తి చేసిన అంగన్‌వాడీ భవనం పనులు పూర్తిక సంబంధిత కాంట్రాక్టర్ ప్రభుత్వానికి అప్పచెప్పారని తెలిపారు. కనీసం పిల్లలు కూర్చోవడానికి ఫ్లోరింగ్ లేక గుంతలమయంగా తయారు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ భవనం పనులపై పంచాయతీరాజ్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. పనులు నాసిరకంగా జరిగాయని ఆమె అన్నారు. ఇందులో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కాళ్లమెహన్, నాయకులు శ్రీరాంమురళి, గొంటిముక్కుల అడెల్లు, దాసరి చిరంజీవి, తాళాలి సాయి, కచ్‌కంటి రాజులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు

బోథ్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాకెర, కౌట గ్రామాల మధ్య గత రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనాన్ని ఢీకొని వ్యక్తి మృతికి కారణమైన వాహనాన్ని సోమవారం పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. అజాగ్రత్తగ వాహనం నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో మహరాష్ట్రకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. దీంతో పోలీసులు వాహనం కోసం గాలించఘా సోమవారం వాహనం పట్టుబడిందని ఎస్సై తెలిపారు. వ్యక్తి మృతికి కారణమైన శీడం శంబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత

భీంపూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామంలో రావుల ఇస్తారి అనే వ్యక్తి అక్రమ దేశీదారు అమ్ముతున్నాడన్న విశ్వసనీయ సమాచారంతో జైనథ్ సిఐ సాయిపాథ్ ఆధ్వర్యంలో భీంపూర్ ఎస్సై మహ్మద్‌తో కలిసి తన సిబ్బందితో రావుల ఇస్తారి ఇంటి పై మెరుపు దాడి చేసి సుమారు ఐదువేల విలువ గల దేశీదారు పట్టుకున్నట్లు ఎస్సై మహ్మద్ కలీం తెలిపారు. ఎమ్ఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.



పట్టుకున్న దేశీదారును సీజ్ చేస్తున్న ఎస్సై


ఆదిలాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న


ముక్రా(కె)లో కేసీఆర్ చిత్రపటానికి హారతులిస్తున్న మహిళలు

ప్రజలు మరోసారి
కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

● బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ● జిల్లావ్యాప్తంగా ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


● ఉట్నూర్‌లో మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడే రాష్ట్ర అభివృద్ధికి వెలుగుబాటలు వేశాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా గంగపుత్ర శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు మొక్కలను అందించి ప్రతిఒక్కరు మూడు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి శనిల దాపరించాడని మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం అనే కలను తన రాజ్యాంగబద్ధమైన పోరాటం ద్వారా నిజం చేసి రాష్ట్రాన్ని పదేళ్లలో దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని అన్నారు. ఆయన స్ఫూర్తి, పట్టుదలతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైతం ప్రజా సంక్షేమంలో ముందు ఉంటూ ప్రజాధారణ పొందడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్, నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనిస్‌అక్బాని, సాజిదొద్దిన్, కస్తాల ప్రేమల, స్వరూప రాణి, బొడగం మమత, కరుణ, పరమేశ్వర్, దమ్మపాల్, కొండ గణేష్, పవన్ నాయక్, పందిరి భూమన్న, అశోక్ స్వామి, ఆఫ్‌కం గంగయ్య, ఉగ్గేవిఠల్, దేవ దాస్, ఏజాజ్, అతరుల్లా, అయోబ్,ద యాకర్, ఆసీఫ్, తదితరులున్నారు.

● ముక్రా(కె)లో అభిమానుల ప్రత్యేక పూజలు

ఇచ్చోడ: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్ జన్మదిన వేడుకలను మండలంలోని ముక్రా (కె) గ్రామంలో కేసీఆర్ అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. కేసీఆర్ లేక తమ బ్రతుకులు ఆగమయ్యాయని మళ్లీ తమ బతుకులు బాగుపడాలంటే మళ్లీ కేసీఆరే రావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన ఆయన లేక పల్లెలన్నీ కుంటుపడ్డాయన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి హారతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మీనాక్షి, మాజీ ఎంపీటీసీ సుభాష్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన యువకులు

ఉట్నూర్: మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు 75వ పుట్టినరోజు వేడుకలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన అనంతరం స్థానిక కొమురంభీం ప్రాంగణంలో ఉన్న దివ్యాంగుల వికాసం పాఠశాలలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేసిన అనంతరం పాఠశాల ఆవరణలో కేసీఆర్ జన్మదినంకు గుర్తుగా మొక్కలు నాటారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పంద్రాజైవంతరావు, మాజీ వైఎస్ ఎంపీపీ సలీం, సింగారేభరత్, కాటం రమేష్, కొమ్ము విజయ్, పెందూరుప్రభాకర్, భరత్‌చౌహన్, వసంతరావు, శ్యామ్,దావుల రమేష్, సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రత్యేక తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యమైంది

జైనథ్ రూరల్: దేశంలో ఉద్యమం ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన మాజీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం మండలంలోని గిమ్మా గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలను నాటారు. అనంతరం జైనథ్ మండల కేంద్రంలో గల అతి ప్రాచీన ఆలయం అయిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.లింగారెడ్డి, గిమ్మా మాజీ ఎంపీటీసీ కోల భోజన్న, అకోలి మాజీ సర్పంచ్ కె.కేశవ్, డీసీసీబీ డైరెక్టర్ కె.పురుషోత్తంయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కర ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి పి.గణేష్‌యాదవ్, తదితరులున్నారు.

అలాగే, కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం మండలంలోని కాప్రీ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం భీంనగర్ కాలనీలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేశారు.

నార్నూర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి స్వీట్లు పంచారు. అదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పరిపాలనలో అన్ని వర్గాలకు ప్రజలకు సమన్యాయం జరగిందన్నారు. అరవై ఏండ్ల స్వరాష్ట్ర కలను సాకారం చేసి, తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో కొరవడిన సమన్వయం!

(5వ పేజీ తరువాయి...)

మారింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆ పార్టీకి ఏమేరకు మద్దతుగా నిలుస్తారో? అర్థంకాని పరిస్థితి ఉందని సొంత పార్టీలోనే చర్చ జరుగుతోంది. ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ముఖ్య కార్యకర్తల జిల్లా సమావేశాలకు ఆశించిన స్థాయిలో ఆదరణ కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ముఖ్య నేతలే ఈ సమావేశాలకు డుమ్మా కొట్టడం పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పట్టభద్రుల మద్దతును కూడగట్టే విషయంలోనూ కాంగ్రెస్ విఫలమవుతోందనే ప్రచారం జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ ముఖ్యనేతలంతా కలిసికట్టుగా పనిచేయక పోవడమే ఈ పరిస్థితికి అసలు కారణమంటున్నారు. మొత్తానికి రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్‌కు పెద్ద సవాలుగానే మారాయన్న టాక్ వినిపిస్తోంది.

అక్రమ కట్టడం తొలగింపు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భూ కబ్జా, ఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 9492164153కు మంచి స్పందన వస్తోందని ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు తెలిపారు. సోమవారం టోల్ ఫ్రీకి వచ్చిన సమాచారం మేరకు కేఆర్‌కే కాలనీలో వెలిసిన అక్రమ కట్టడాన్ని టాస్క్ ఫోర్స్ టీం తొలగించారు. పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నందున జిల్లా కలెక్టర్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారన్నారు.

'పథకాలు అందరికీ అందాలి'

తాంసి రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలలో ప్రతీ ఒక్కరికి అవకాశం కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వడ్డాది గ్రామంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. తర్వాత రానున్న రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు స్వామి, రవీందర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎస్సై చేయూత

బోథ్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన వినాయక్‌కు ఎస్సై ప్రవీణ్ చేయూతను అందించారు. ఇటీవల హైదరాబాదులో చికిత్స చేసుకునేందుకు డబ్బులు లేకపోవడంతో తన ఇంటికి తిరిగి రావడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్సై సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లారు. బోథ్‌లో వైద్యం సరైన రీతిలో అందకపోతే అవసరమైతే ఆదిలాబాద్ ఆసుపత్రికి తరలించేందుకు సైతం పోలీసు శాఖ తరపున సహకారం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

అర్బన్ పార్క్‌లో అగ్ని ప్రమాదం

బోథ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బోథ్ రేంజ్ పరిధిలోని బోథ్ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న అర్బన్ పార్కులో అగ్ని ప్రమాదం సంభవించింది. సోమవారం మధ్యాహ్నం పార్కులో మంటలు రేగడంతో చిన్నచిన్న మొక్కలతో పాటు గడ్డి కాలి బూడిదయింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రతి ఏటా వేసవికాలంలో ఈ పార్కులో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.


అర్బన్ పార్కులో చెలరేగుతున్న మంటలు

కేంద్రం బడ్జెట్‌పై నేడు, రేపు నిరసన : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై నేడు, రేపు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. విలాస్ ప్రకటించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పుట్యార్ నరేందర్ రెడ్డికి మద్దతు ఇస్తున్నామని, భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై ఆందోళన చేపడతామని ఈ నెల 28లోగా ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. హమాలీలు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మాట్లాడారు. సహాయ కార్యదర్శి ఉపాలి, భూక్యా రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న జాన్సన్ నాయక్

పెంబి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూమాగౌడ్ తల్లి, తలారి శేఖర్ చిన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సల్ల నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బడుగు మల్లేష్, సుతారి మహేందర్, సొన్న రాజేందర్, స్వామి, తదితరులు ఉన్నారు.

దళారుల కోసం పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు భరత్‌చౌహాన్

ఉట్నూర్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్క్‌ఫెడ్ సంస్థ ఉన్నట్టా లేనట్టా...? రేవంత్‌రెడ్డి సర్కార్ మొద్దునిద్రలో ఉందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు భరత్‌చౌహాన్ ఒక పత్రిక ప్రకటనలో సోమవారం విమర్శించారు. రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా కనబడుతుందని కందులను కొనుగోలు చేయాల్సిన మార్క్‌ఫెడ్ సంస్థ ఈ రోజు వరకు తెరవలేదని ఆ కారణంగా ఏజెన్సీ ప్రాంత రైతులు తీవ్ర దోపిడికి గురవుతున్నారన్నారు. 7500 ధర దక్కాల్సిన రైతుకు కేవలం రూ.6 వేలకే అమ్ముకుంటున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వ యంత్రాంగం మేలుకోక పోతే రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని గమనించాలని, లేని పక్షంలో రైతులు అందరితో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సుప్రీంకోర్టులో మాజీ మంత్రి వేణుగోపాలాచారికి ఊరట

● పోలీసుల ఎదుట లొంగుబాటు నుంచి మినహాయింపు ● 23 ఏళ్ల క్రితం కానిస్టేబుల్‌పై దాడి చేసినట్టు కేసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్‌పై దాడి కేసులో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారికి సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అరెస్టు నిమిత్తం పోలీసుల ఎదుట లొంగిపోవడం నుంచి మినహాయింపు ఇస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. 2002లో తునికాకు సేకరణ కోసం అడవిలోకి వెళ్లొద్దంటూ స్థానికులను ఆదిలాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఆ విషయాన్ని అప్పటి ఎంపీగా ఉన్న వేణుగోపాలాచారి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆ సమయంలో విధుల్లో భాగంగా వచ్చిన కానిస్టేబుల్ హరీశ్‌చంద్ర, స్థానికులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి తనపై దాడి చేశారంటూ హరీశ్‌చంద్ర కేసు పెట్టారు. సుదీర్ఘ వాదనల తర్వాత ట్రయల్ కోర్టు వేణుగోపాలాచారికి ఆరు నెలల సాధారణ జైలు, రూ.500 జరిమానా విధించింది. ఆ తీర్పును ఆయన హైకోర్టులో సవాల్ చేయగా స్టే లభించింది. హైకోర్టు స్టే గడువు ముగిసే దశకు రావడంతో గత ఏడాది జూన్ 4న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. పోలీసుల ఎదుట లొంగిపోకుండా గతంలో ఇచ్చిన మినహాయింపును ఏప్రిల్ వరకు పొడిగిస్తున్నట్టు తెలిపింది. ఈ కేసు మరోసారి ఏప్రిల్ 8న విచారణకు వచ్చే అవకాశముంది.

నిర్మల్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు


నిర్మల్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పండ్లు అందజేస్తున్న దృశ్యం


ముథోల్‌లో రోగులకు పండ్లను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినోత్సవ వేడుకలను నిర్మల్ జిల్లాలో ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేకులు కోసి మిఠాయిలు పంచారు. ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు 71వ జన్మదిన వేడుకలను సోమవారం నిర్మల్‌లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణ శివారులోని కొండాపూర్‌లో గల జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కే. రామ్‌కిషన్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ యు. సుభాష్ రావు, నాయకులు లక్ష్మణచారి, జీవన్ రెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

ముథోల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బండారి గంగాధర్, లతీఫ్, కే. అంజయ్య, పెండెల లక్ష్మణ్, పోతుగంటి లక్ష్మణ్, మరిబా, గంగాధర్, తదితరులున్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు రమాదేవి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి ప్రశాంత్, ఎస్. గంగాధర్, కిషన్, నరేష్, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కడెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ హాజరై స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కడెం మండల అధ్యక్షులు జీవన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కోఆప్షన్ మెంబర్ రఫీక్ అహ్మద్, నాయకులు కోల గంగన్న, బీఆర్ఎస్ కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో బీఆర్ఎస్ నాయకుల పూజలు

సారంగాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజును నిర్వహించారు. కేక్‌కట్ చేసి, స్వీట్లను పంచిపెట్టి ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ప్రజల గుండెల్లో ఎప్పుడు ఉంటారన్నారు. పేద ప్రజల సంక్షేమానికి పాటుపడిన ఏకైక మాజీ సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను ఖానాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయ ఆవరణలో వృక్షార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృక్షార్చనలో భాగంగా మొక్కలు నాటిన అనంతరం స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అక్కడి నుండి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు అక్కడ రోగులకు ఉచితంగా పండ్లను పంపిణీ చేశారు.

రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఇసుక వేలం


ఇసుకకు వేలం పాట వేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్మల్ గ్రామీణ మండలం పరిధిలో వివిధ గ్రామాల్లో అక్రమంగా పట్టుబడ్డ 35 ట్రాక్టర్ల ఇసుకవేలం పాటను సోమవారం మంజులాపూర్ సమీపంలో అధికారులు సమక్షంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారు. కాగా 64,700ల రూపాయలకు ఇసుకను వేలం పాటలో షేక్ ముబీన్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో నిర్మల్ గ్రామీణ మండలం తహసీల్దార్ సంతోష్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, నిర్మల్ గ్రామీణ ఎస్సై లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థినికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన ఆసుపత్రిలో సోమవారం పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 1385 మంది విద్యార్థులకు లోపాలున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. కన్ఫర్మేషన్ రెఫ్రాక్టివ్ లోపల పరీక్షల తరువాత కంటి అద్దాలు అందిస్తామన్నారు. సూపరింటెండెంట్ గోపాల్, డీఎంహెచ్‌వో రాజేందర్, వైద్యులు సురేష్, ఇద్రిస్, నయనారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



కుంటాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

కుంటాల, ఫిబ్రవరి, 17 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదర్శ మాడల్ పాఠశాలలో విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పలు రకాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు బహుమతులను అందజేశారు. యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్య క్రమం నిర్వహించామని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బోగ గోవర్ధన్, గుడ్డేటి గంగయ్య, జక్కుల ముత్యం, శ్రావణ్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమతా కుంభ్ - 2025లో అలరించిన
భైంసా కళాకారుల నృత్య ప్రదర్శనలు


ప్రదర్శనలు నిర్వహించిన భైంసా కళాకారులు

భైంసా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) ; పట్టణంలోని శ్రీనయనం నృత్య కళానిలయానికి చెందిన కళాకారులు రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ మండలం శ్రీరామ నగరంలో చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన సమతా కుంభ్-2025 వేడుకల్లో చేపట్టిన ప్రదర్శనలు అలరించాయి. సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్, జీయర్ ఛానల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి సమతా కుంభ్-2025 మహోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన 3వేల మందికి పైగా కళాకారులు ఏకకాలంలో మహా బృంద నాట్యం నిర్వహించారు. ఇందులో భైంసాకు చెందిన 30 మందికి పైగా విద్యార్థులు పాల్గొని నాట్య ప్రదర్శన చేపట్టారు. నృత్య కళా నిలయానికి చెందిన నిర్వాకురాలు డా. రంగు సౌమ్య-సంపత్ నేతృత్వంలో కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు ఆహంతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కళాకారులకు అభినందించి ప్రశంస పత్రాలను, జ్ఞాపికలను బహూకరించారు.

ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తే చర్యలు

● నాలుగు టిప్పర్ల పట్టివేత ● పోలీస్‌స్టేషన్‌కు తరలింపు


అనుమతి లేకుండా మొరాన్ని తరలిస్తున్న టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం

తలమడుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక. మొరం తరలిస్తే వారిపై ఉక్కుపాదం తప్పదని తలమడుగు తహసీల్దార్ హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కజ్జర్ల శివారు ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న మొరం టిప్పర్లను రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది నాలుగు టిప్పర్లను తలమడుగు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజమోహన్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులను ఆదేశాల మేరకు పోలీస్ అధికారులతో మొరం తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే బాధ్యులపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో మొరం తవ్వినట్టు తెలిస్తే వారికి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కొంతమంది మొరం వ్యాపారులు రాత్రిపూట మొరం తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మైనింగ్ పోలీస్ సిబ్బంది, రెవె న్యూ అధికార సహకారంతో రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేసి అక్రమ మొరాన్ని అరికట్టేందుకు చర్యలు చేపడ తామన్నా రు. గతంలోనూ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలించడంతో నాలుగు జేసీబీలను సీజ్ చేసి దాదాపు రెండు లక్షల వరకు జరిమనా విధించడం జరిగిందన్నారు. అదేవిధంగా మొరం టిప్పర్‌ను పట్టుకొని జరిమాన వేశామన్నారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా. అక్రమ దందా నిర్వహిస్తే బాధ్యులపై శాఖ పదమే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

బేలలో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో పోలీసులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బేల మండలంలోని కంగార్‌పూర్ గ్రామ శివారులో పెన్‌గంగా నది వద్ద ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో బేల ఏఎస్సై లింగన్న సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా మూడు ఇసుక ట్రాక్టర్‌లు అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడ్డాయన్నారు. వాటిని సీజ్ చేసి బేల పోలీసు స్టేషన్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుం టున్నట్లు జైనథ్ సీఐ తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అక్రమ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, అవసరమైతే క్రిమినల్ కేసు లు పెట్టాలని, వారి సూచనల మేరకు ఇసుక అక్రమ రవాణా జరుగకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు.

రక్తదానం చేద్దాం..
ప్రాణదాతలుగా నిలుద్దాం!

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రక్త దానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. జీవితంలో రెండు దానాలు గొప్పవని అన్నదానం, రక్తదానం. మొదటిది సాటి మనిషి కడుపు నింపితే రెండవది సాటి మ నిషి ప్రాణాలు నిలబెడుతుందని బోథ్ ఎమ్మెల్యే అని ల్‌జాదవ్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర సా ధకులు, బంగారు తెలంగాణ నిర్మాత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌జన్మదిన సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నేరడిగొండలో తన నివాసం వద్ద ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నిర్వహించిన రక్తదాన శిబిరానికి కేసీఆర్ మీద అభిమానంతో రక్తదానం చేయడానికి నాయకులు, వికలాం గులు, అభిమానులు, రైతులు భారీ ఎత్తున తరలి వచ్చారు. రక్తదానం చేస్తూ ప్రతీఒక్కరు కేసీఆర్ జన్మదిన శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తాను నిర్వహిం చిన రక్తదాన శిబిరానికి భారీ స్పందన వచ్చిందని నియోజక వర్గంలోని మారుమూల ప్రాంతాల నుంచి 700 పై చిలుకు మంది రక్తదానం చేశారని దీన్ని బట్టి తెలంగాణలో ఇంకా ప్రజలు కేసీఆర్‌నే కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్‌సజన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాక్స్ చైర్మన్లు, నియోజక వర్గం నలుమూలల నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, రైతులు, వికలాంగులు, యువకులు తరలివచ్చారు.


రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కంకర వేశారు.. మధ్యలోనే వదిలారు!

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు



రంజిని గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలా

కుబీర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగు పరచాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు రెండు సంవత్సరాలు అవుతున్నా పనులు పూర్తి చేయడం లేదు. పనులు ప్రారంభించి కొంత మేర కంకర పోసి వదిలేశారు. దీంతో స్థానికులకు రవాణా కష్టాలు పెరిగి ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని గిరిజన ప్రాంతమైన రంజిని గ్రామ నుంచి జాంగామ్ గ్రామ శివారు వరకు 3.2కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. కోటి 80లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారు 2023 మే నెలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాల్సి ఉన్నా.. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుత్తేదారు పనులు చేయడం లేదు. దీంతో కంకర వేసిన రోడ్డుపై వెళ్లే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. తారు రోడ్డు నిర్మాణంతో సౌకర్యంగా మారుతుందని ఆశించిన జనాలకు మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టింది. పనులు పూర్తి చేసేలా చొరవ చూపాలని అధికారులకు, పాలకులకు పలుమార్లు విన్నవించినా.. స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తారు రోడ్డు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల బారిన వాహనదారులు

● బాలు, రంజిని గ్రామ వాసి

రోడ్డు పనులు చేపట్టిన గుత్తేదారు సుమారు సంవత్సరంన్నర క్రితం కంకర వేసి వదిలేశాడు. దీంతో పాదాచారులు సైతం నడవడానికి వీలు లేకుండా పోయింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాదారులు రాకపోకులు సాగిస్తుంటారు. ఈ మార్గంలో ఇప్పటి వరకు ద్విచక్రవాహనదారులు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి గాయాలపాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుత్తేదారుతో పనులు పూర్తి చేయించాలి. లేకుంటే మున్ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

త్వరలో పనులు చేపట్టేలా చర్యలు

● ఐటీడీఏ ఏఈ ప్రదీప్

రంజిని నుంచి జాంగామ్ శివారు వరకు నిలిచి పోయిన రోడ్డు పనులను త్వరలో చేపట్టేలా సంబంధిత గుత్తేదారులపై చర్యలు తీసుకుంటాం. పనులు సకాలంలోనే పూర్తి చేయాలని రెండు సార్లు నోటీసులను అందజేశాం. మారోమారు నోటీసు జారీ చేస్తాం. పనులు చేపట్టక పోతే టెండర్‌ను రద్దు చేసి మరో గుత్తేదారుతో సకాలంలో పనులు పూర్తి చేసి గ్రామస్తులకు సౌకర్యం కల్పిస్తాం.



చామన్‌పెల్లి గ్రామం నుంచి వెళ్తున్న అంతర్‌జిల్లా రహదారిపై పార్కింగ్ చేసి ఉంచిన వాహనాలు

రోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నా..
పట్టించుకునే వారే కరువు!

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్ జిల్లా రహదారి, పలు ప్రధాన రహదారులలో వాహనాలను పార్కింగ్ చేస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు కలుగజేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే లేరన్నా.. అంటూ బాధితులు సోమవారం ఆంధ్రజ్యోతితో తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి పలు రహదారులను పరిశీలించగా చాలా చోట్ల ట్రాక్టర్లు, ట్రాక్టర్ ట్రాలీలు, జేసీబీలు, సిమెంట్, కంకర మిక్సింగ్ యంత్రాలు, గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్లు, ఇతర భారీ, చిన్న తరహా వాహనాలు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి ఉంచటం కనిపించింది. రోడ్లపై పార్కింగ్ చేయటం వలన వాహనాలు ఎదురెదురుగా వస్తున్నప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. దీని కారణంగా గతంలో పలు ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి పోలీసులు గానీ, సంబంధిత అధికారులు గానీ వాహనాలు రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూడాలని కోరారు. పట్టణ తరహాలో జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తే అశ్రద్ధపరులకు భయంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని తెలిసినా అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదో అర్థం కావటం లేదని పలువురు వ్యాఖ్యానించటం గమనించదగినది.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా
ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

తలమడుగు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో అతి పురాతనమైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి. అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న సుదర్శన మహాయజ్ఞంలో పాల్గొనేందుకు తలమడుగు గ్రామానికి చెందిన డాక్టర్ అల్లూరి సంజీవరావు వృత్తిరీత్యా దుబాయ్ దేశంలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉన్న ఊరు కన్నతల్లిని చదివిన బడిని ఎప్పటికీ మర్చిపోవద్దని దృఢ సంకల్పంతో విధులకు సెలవు పెట్టి సొంత ఊరిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల మహా యజ్ఞంలో వారి దంపతులు సుదర్శన్ మహా యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 19న నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణ రథోత్సవం రోజున నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమాన్ని డాక్టర్ సంజీవరెడ్డి దంపతులు సొంత నిధులతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో మా యజ్ఞ ప్రారంభం. గరుడ వివాహం మెహెంది ఫంక్షన్ తదా కార్యక్రమాలను వేద పండితులు రాంగోపాల్ చారి, రంగయ్యచారి, శ్రీనివాసచారి, కళ్యాణ్ కుమార్, ఆశిష్ కుమార్ గ్రామ పెద్దలు పిడుగు సంజీవ రెడ్డి, నల్ల రత్నాకర్ రెడ్డి. వెంకటేష్ పాల్గొన్నారు.



తలమడుగులో సుదర్శన మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు


గరుడ వివాహం నిర్వహిస్తున్న వేద పండితులు


మహా యజ్ఞంలో పాల్గొన్న మహిళలు

వామ్మో.. చలి


చలి మంటలు కాచుకుంటున్న చిన్నారులు

తాంసి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజుల నుంచి తాంసి మండలంలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. దీంతో దినంలోనూ చలి మంటలు కాగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం పూట చలి మొదలై ఉదయం 11 గంటల వరకు కూడా చలి తీవ్రత ఉండటంతో చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చీకటి పడిందంటే బయటకు వెళ్ల లేని పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు పాఠశాలకు పోవా లంటేనే గజగజ వణుకుతూ వెళుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత ఇంకా ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి అయితే మరింత దయనీయంగా మారింది. మంచం కింద చలిమంట పెట్టుకొని పడుకుంటున్నారంటే అందులో ఎలాంటి అతిశయోక్తి లేదు.

శివరాత్రి కోసం ఆలయాల ముస్తాబు


ముస్తాబవుతున్న కుభీర్‌లోని శివసాయి ఆలయం

కుభీర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జరశంకర, పల్సి కాశీ విశ్వనాథ్, బ్రహ్మేశ్వర్, మల్లన్న గుట్ట శివాలయాలు శివరాత్రి పండగకు ముస్తాబవుతున్నాయి. శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ నాయకులు బిజీబిజీగా మారారు. ఆలయాలకు తిరుతిరు రంగులు వేస్తూ ఆకర్షనీయంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ఆలయాల్లో శివరాత్రి రోజు రాత్రి బజనలు, భక్తి సంకీర్తనలు చేస్తూ జాగారం చేస్తారు. పార్డి(బి) గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాతర జరుగుతుంది.

యూరియా బస్తాల కోసం
రైతుల పడిగాపులు

నర్సాపూర్(జి), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ యూరియా లోడ్ రావడంతో రైతులు యూరియా తీసుకోవడానికి బారులు తీరారు. మండల కేంద్రంలో సొసైటీ ఆఫీస్ తెరుచుకోలేకపోవడంతో, అద్దె ఇంటికి ఎటువంటి బోర్డు, చరవాణి నెంబర్ లేకపోవడంతో రైతులు వెనుదిరిగి పోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డు, స్టాక్ పట్టిక ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.


సొసైటీ ఆఫీస్ వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో
బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్య ర్థులను గెలిపించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ మండ ల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నియామకమైన బీజేపీ మండలాధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసిన పార్టీగా ఒక్క బీజేపీకే ఓట్లు అడిగె హక్కు ఉందన్నారు. మేధావులు ఆలో చించి బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, జి.నగేష్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రా రెడ్డి, బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో బీజేపీ మండల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.2 : కనిష్ఠం 17.5



పోటాపోటీగా ఇసుక నిల్వల వేలం పాట

భైంసా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) ; పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలకు సోమవారం నిర్వహించిన వేలం పాటలు పోటాపోటీగా కొనసాగాయి. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు జయరావు, కృష్ణగౌడ్‌ల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాటలు జరిగాయి. స్వాధీనపర్చుకున్న 300 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలకు నిర్వహించిన వేలం పాటలో పది మంది పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన ఈ వేలం పాటలో ప్రభుత్వ పాట రూ. 1.80లక్షలు ఉండగా, లింగురాం అనే వ్యక్తి సంబంధిత ఇసుక నిల్వలను రూ. 4లక్షలకు దక్కించుకున్నారు.

కష్టాల్లో.. కొయ్యబొమ్మలు



- బొమ్మల తయారీకి వాడే పొనికి కర్ర కొరత
- ప్రత్యామ్నాయ కలప లేక ఇక్కట్లు
- ప్రస్తుతం ప్లాంటేషన్ జరుగుతున్నా ఇప్పట్లో కలప రాదు
- చేసిన బొమ్మలకు సరైన మార్కెట్ లేక నష్టాలు
- ఫలితమివ్వని శిక్షణలు
- కళాకారుల ఉపాధిపై నీలి నీడలు
- నెరవేరని ప్రధాని హామీలు
- చేతివృత్తుల పాలసీపైనే కళాకారుల ఆశలు



కొయ్య బొమ్మలను తయారు చేస్తున్న కళాకారుడు



నాగేంద్రుడి బొమ్మను తీర్చిదిద్దుతున్న కళాకారుడు

నిర్మల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమ సంక్షోభం దిశగా పయనిస్తోంది. పలు సమస్యలతో ఈ పరిశ్రమ సతమతమవుతున్నప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొంతకాలం క్రితం చేతి కళావృత్తులను ఆదుకుంటామంటూ హామీ ఇచ్చిన నిర్మల్ కొయ్యబొమ్మల కళాకారుల తలరాతలు మారడం లేదు. ఎంపీ ఎన్నికల సందర్భంగా ప్రచారం కోసం వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పరిశ్రమను అణగదొక్కిందని ఆరోపించారు. కొయ్యబొమ్మల కళాకారులకు ఉపాధి కల్పించే దిశగా కొత్తపాలసీ అమలు చేస్తామంటూ ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ప్రధాని ఈ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోతుండడం విమర్శలకు తావిస్తోంది. కాగా సంప్రదాయ పద్దతిలో తయారు చేస్తున్న కొయ్య బొమ్మలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ ముడిసరుకు ధరలు పెరుగుతుండడం, అలాగే పొనికి కర్ర కొరత ఏర్పడుతుండడంతో పాటు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన విధానం సక్రమంగా లేకపోవడం, ప్రభుత్వాలు ఈ పరిశ్రమను ఆశించిన రీతిలో ప్రోత్సహించకపోతుండడంతో దీని మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. ముడిసరుకు ధరల పెరుగుదల బొమ్మల తయారీపై ప్రభావం చూపుతోందని తద్వారా కళాకారుల ఉపాధికి గండి పడుతోందంటున్నారు. నిర్మల్ కొయ్యబొమ్మలకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. ఇక్కడ తయారయ్యే కొయ్యబొమ్మలను దేశ, విదేశాల్లో కూడా విక్రయిస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఈ కొయ్యబొమ్మలకు ఆశించిన మేరకు డిమాండ్ ఉన్నప్పటికీ సంప్రదాయ రీతిలో ఉన్న మోడల్స్‌కు క్రమంగా ఆదరణ తగ్గుతోంది. అలాగే కొయ్య బొమ్మల తయారీ కోసం ఉపయోగించే ముడి సరుకు ధరలు పెరిగిపోవడం, ఇతర ఖర్చులు భారీగా పెరగడంతో ప్రస్తుతం కొయ్య బొమ్మల ధరలు కూడా పెరిగాయి. ముడిసరుకు కొరత, ధరల పెరుగుదలతో బొమ్మలకు గిరాకీ క్రమంగా తగ్గుతోంది. ఈ పరిశ్రమను బలోపేతం చేసేందుకు గానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోతుండడం కూడా ఈ పరిశ్రమకు శాపంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ తరపున ఎంపీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పరిశ్రమను పూర్తిగా విధ్వంసం చేసిందని, కళాకారుల పొట్ట కొట్టిందంటూ ఆరోపించారు. కేంద్రంలో ఏర్పడబోయే బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా కొయ్య బొమ్మల పరిశ్రమను ఆదుకుంటుందని ఈ పరిశ్రమను ప్రోత్సాహించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామంటూ మోదీ హామీ ఇచ్చారు. ప్రధానిమోదీతో నిర్మల్ కొయ్య బొమ్మల కళాకారుల కుటుంబాల్లో కొత్త ఆశలు రేకెత్తాయి. అయితే ఎన్నికలు ముగిసి కేంద్రంలో మళ్లీ నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కొత్తప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గానీ కొయ్య బొమ్మల పరిశ్రమకు సంబంధించి ఎలాంటి ప్రకటన వెలువడకపోతుండడంతో కళాకారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రధాని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వారంతా కోరుతున్నారు. ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్ సంస్థ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా నిర్మల్ కొయ్య బొమ్మలకు కొత్త అందాలు తెచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ ఆధ్వర్యంలో గురు,శిష్య హస్త శిల్ప ప్రశిక్షణ కార్యక్రమం కింద నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రాన్ని మాత్రమే ఎంపిక చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని లక్ష్మి గారి పల్లె, విశాఖ జిల్లాలోని ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ఈ పథకం కింద ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం మాత్రం కేవలం నిర్మల్ కొయ్యబొమ్మలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కొయ్యబొమ్మల రూపురేఖలను మరింత ఆధునీకరించేందుకు సిద్దమవుతున్నారు. గురు శిష్య హస్త ప్రశిక్షణలో భాగంగా కేవలం 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల్లోపు ఉన్న యువ కళాకారులకు ప్రాధాన్యతనిస్తారు. వీరందరికి మూడు నెలల పాటు ఇక్కడ నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రంలో శిక్షణ నిర్వహించారు.

ఫలితమివ్వని శిక్షణలు

మూడు నెలల పాటు శిక్షణ పూర్తయిన తరువాత వీరందరికి అర్టిజన్ ఐడీ కార్డులను కూడా కేంద్రజౌళి శాఖ అందించింది. ఈ అర్టిజన్ ఐడెంటీ కార్డుల ద్వారా దేశ, విదేశాల్లో నిర్వహించే ట్రేడ్ పేర్‌లలో కొయ్య బొమ్మల ప్రదర్శనకు అవకాశాలు ఏర్పడాయని అధికారులు స్పష్టం చేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా కొయ్య బొమ్మల విక్రయాలకు కేంద్రజౌళి శాఖ ఆధ్వర్యంలోని ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ హ్యాండీక్రాఫ్ట్ సంస్థ చర్యలు తీసుకోవాలని మొదట్లో భావించారు. ఇప్పటి వరకు ఈ దిశగా ఎలాంటి చర్యలు మొదలుకాలేదు. నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రం వర్క్‌షాపులో గురుశిష్య హస్త శిల్ప ప్రశిక్షణ కార్యక్రమాన్ని ఇప్పటికే నిర్వహించారు. యువ కళాకారులకు ఆధునిక మోడల్స్ కొయ్య బొమ్మల తయారీకి సంబంధించి అవగాహన కల్పించారు. కేవలం కొయ్య బొమ్మల బొమ్మల తయారీతో పాటు బహిరంగ మార్కెట్‌లో రోజు రోజుకు పెరుగుతున్న పోటీ, అలాగే ప్రజల ఆసక్తి, డిమాండ్‌ను కూడా పరిగణలోకి తీసుకొని కొయ్య బొమ్మలను తయారు చేసే విధంగా శిక్షణ ఇచ్చినప్పటికి ఆ శిక్షణ ద్వారా కళాకారులకు పెద్దగా ప్రయోజనం చేకూరదని అంటున్నారు. కేవలం ఇది ఓ తంతులాగా మాత్రమే ఈ శిక్షణ కొనసాగిందని కళాకారులు అభిప్రాయపడుతున్నారు.

పొనికికి ప్రత్యామ్నాయం లేకనే..

కాగా గత పది సంవత్సరాల నుంచి నిర్మల్ కొయ్య బొమ్మల పరిశ్రమను పొనికి కలప కొరత తీవ్రంగా వెంటాడుతోంది. ప్రస్తుతం అడవులలో పొనికి చెట్ల సంఖ్య తగ్గిపోతుండడం, ప్రత్యేకంగా ప్లాంటేషన్ చేపట్టకపోతున్న కారణంగా కలప కొరత ఏర్పడుతోంది. కేవలం ఒకటి లేదా రెండు టింబర్ డిపోలలో మాత్రమే పొనికి నిల్వలున్నాయి. కొద్ది రోజుల క్రితం ఉపాధి హామీ పథకం కింద నిర్మల్‌లోని పలుచోట్ల పొనికి ప్లాంటేషన్ చేపట్టినప్పటికి వాటి పెంపకం ఇప్పట్లో కాదంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొనికి ప్లాంటేషన్‌ను మరింత విస్తృతంగా చేపట్టినట్లయితేనే ఈ కలపకు కొరత తీరుతుందని చెబుతున్నారు.

ప్రధాని హామీపై ఆశలు

రాచర్ల కిషన్ వర్మ, కొయ్య బొమ్మల కళాకారుడు, నిర్మల్

కొయ్యబొమ్మల పరిశ్రమను ఆదుకుంటామని ప్రధానిమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీపై తాము ఆశలు పెట్టుకున్నాం. ప్రధానిహామీని వెంటనే అమలు చేయాలి. ప్రధాని కొయ్య బొమ్మల పరిశ్రమను ప్రోత్సాహించేందుకు కొత్త పాలసీని రూపొందిస్తామన్నారు. వెంటనే ఆ పాలసీని అమలు చేయాలి. ప్రధాని హామీ తమ కళాకారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపింది. ఇప్పటికే ఉపాధి లేక, బొమ్మలకు సరియైన మార్కెట్ లేక తాము నష్టాల పాలవుతున్నాం. పరిశ్రమను ముందుకు నడపడం కష్టమవుతుంది. ప్రధాని ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తారని ఆశిస్తున్నాం.

స్నాన ఘట్టం వద్ద ప్రమాదం.. ఒకరి దుర్మరణం



ఘటన స్థలంలో విచారిస్తున్న పోలీసులు

బాసర, ఫిబ్రవరి, 17 : (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి తీరంలో ప్రమాదవశాత్తు పడి ఒకరు దుర్మరణం చెందారు. మహారాష్ట్ర ధర్మాబాద్ తాలుకా రత్నెల్లి గ్రామానికి చెందిన పవార్ బాలాజీ (24) అనే యువకుడు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బాసర వచ్చారు. ముందుగా నదీ స్నానం కోసం గోదావరి తీరానికి చేరుకున్నారు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలోకి జారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేష్ తెలిపారు.

నేటి నుంచి పోస్ట్ కార్డు ఉద్యమం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం నుండి పోస్ట్ కార్డు ఉద్యమం చేపడుతున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ తెలంగాణా ఉద్యమకారుల జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేసి 250 చదరపు గజాల ఇంటి స్థలం మంజూరు, బస్సు ప్రయాణాల్లో రాయితీ, అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, తదితర వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఓటింగ్‌పై గ్రాడ్యుయేట్‌లకు అవగాహన

లోకేశ్వరం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకునే గ్రాడ్యుయేట్‌లకు లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఎమ్మెల్సీలో పోటీ చేసే వారి కార్యకర్తలు, గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం పుష్పూర్ గ్రామంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలో ప్రాక్టికల్‌గా వివరించారు. గ్రామంలో ఉన్నటువంటి గ్రాడ్యుయేట్లు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, మురళి, లక్ష్మణ్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూట్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులతో కలిసి అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకునే దారి, దూరం, పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు పట్టు సమయం తదితర అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ఠ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్ చైర్, ర్యాంపు వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు చేరుకున్న పోలింగ్ సామాగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది సామాగ్రి తరలింపునకు సంబంధించిన వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల కామన్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలను తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి మరోసారి శిక్షణ నిర్వహించి, నమూనా ఎన్నికను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసాల ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డిలు, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి ఎంఏ. రజాక్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

సోన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి లెక్కలను విద్యార్థుల చేయించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఉన్న సమయాన్ని సరిగ్గా వినియోగించుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. సిలబస్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఒత్తిడి లేకుండా చదవాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదిలో 10/10 పాయింట్లు సాధించిన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. సబ్జెక్టుల్లో ఎటువంటి సందేహాలు ఉన్న ఆయా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పి. రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి.. చెట్టును ఢీ కొని ఇద్దరి మృతి



అయిటి మహేందర్ (ఫైల్)



మెంగ సాయన్న(ఫైల్)

సారంగాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో సోమవారం బైక్ అదుపు తప్పి అయిటి మహేందర్, మెంగ సాయన్న అనే ఇద్దరు వ్యక్తులు బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధని గ్రామానికి చెందిన అయిటి మహేందర్, మెంగ సాయన్నలు నిర్మల్ పట్టణం నుండి ధని గ్రామానికి తిరిగి వస్తుండగా చించోలి(బి) గ్రామ సమీపంలో నిర్మల్, స్వర్ణ రహదారి పక్కన ఉన్నటువంటి చెట్టుకు బైక్ ఢీకొని ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి



రాథోడ్ బల్వాన్ మృతదేహం.. ప్రమాదానికి గురైన కారు

బాసర, ఫిబ్రవరి, 17 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఎదుట సోమవారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఎదురెదురుగా వేగంగా వస్తున్న రెండు వాహనాలు ఢీ కొనడంతో రాథోడ్ బల్వాన్ (19) అనే యువకుడు ఘటన స్థలంలో ప్రాణాలు విడిచినట్లు పేర్కొన్నారు. కారులో ఉన్న నలుగురు ఎయిర్ బెలూన్స్ కారణంగా క్షేమంగా బయటపడ్డారని చెప్పారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన రాథోడ్ బల్వాన్ మహారాష్ట్ర భోకర్‌కు చెందినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాసరలో యాచకుడి మృతి

బాసర, ఫిబ్రవరి, 17 : (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ సమీపాన గుర్తుతెలియని వ్యక్తి (60) మృతదేహం లభ్యమైనట్లు స్థానిక పోలీసులు తెలిపారు.స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు మృతి చెందిన వ్యక్తి యాచకుడిగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

ప్రజలకు పోలీసుశాఖ అందుబాటులో ఉంటుంది



వికలాంగుడి సమస్య వింటున్న ఎస్పీ జానకి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోలీసు శాఖ నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తోందని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. వారి సమస్యలు ఓపికగా విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవో

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సోమవారం సందర్శించారు. సామాగ్రి భద్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాకు చేరుతున్న సామాగ్రి ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. పలు రిజిస్టర్లు తనిఖీ చేసి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆర్డీవో రత్న కళ్యాణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.